

# జరుగుమల్లిలో విషాదం



## తమ్ముడు చేతిలో అన్న హత్య

కోట, జనవరి 30 ప్రభాతవార్త

కోట మండలం జరుగుమల్లి గ్రామంలో తమ్ముడు చేతిలో అన్న హత్యకు గురైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్.ఐ పవన్ కుమార్ కథనం మేరకు అన్నతమ్ముళ్లు మస్తానయ్య, కోటయ్య (46) పక్కపక్కనే నివాసిస్తున్నారు. గురువారం తమ్ముడు మస్తానయ్య భార్య సుజాతమ్మ బట్టలు ఉతుకుతూఉండగా ఆ మురికి నీళ్లు అన్న కోటయ్య పశువులు కట్టేసే చోటుకు చేరాయి. దీంతో కోటయ్య తమ్ముడుతో మురికి నీళ్లు వస్తే పశువులను ఏలా కట్టేయాలని అడాగారు. దీంతో ఇరువురు మధ్య వాగ్యావాదం జరిగింది. దీంతో మస్తానయ్య బలమైన కర్రతో ఒక్కసారిగా అన్న కోటయ్య తలపై కోట్టడంతో ఆయన అక్కడేక్కడే కూప్పకూలి మృతి చెందాడు. దీంతో రెండు కుటుంబాల్లో విషాదచాయులు అలుముకున్నాయి. .




# కల్లూరు ఘాట్లో ఒంటరి ఏనుగు హల్చల్



కల్లూరు, జనవరి 30, ప్రభాతవార్త

కల్లూరు ఘాట్ రోడ్డు నందు ఒంటరి ఏనుగు హల్చల్ చేయడంతో ప్రయాణికులు భయాందోళనతో పరుగులు తీశారు. కల్లూరు నుంచి కొమ్మిరెడ్డిగారి పల్లి మీదుగా తిరుపతికి వెళ్లే మార్గంలో ఓ ఒంటరి ఏనుగు రోడ్డుపైకి వచ్చింది. అప్పుడే వెళుతున్న ప్రయాణికులు ఏనుగును చూసి భయంతో పరుగులు తీశారు. దాదాపు 7 అడుగుల ఎత్తు ఉన్న ఒంటరి ఏనుగు నడిరోడ్డుపై నిలబడి ఉండడంతో వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైనే విడిచి పెట్టి అడవిలోకి భయంతో పరుగులు తీశారు. ఒంటరి ఏనుగు అడివిలో ప్రసవించిందని మూడు సంవత్సరాల పాటు ఈ ప్రాంతంలోనే ఉంటుందని ఫారెస్ట్ అధికారులు తెలియజేస్తున్నారు. ఈ ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంబంధిత అధికారులు ఒంటరి ఏనుగు నుంచి తమను రక్షించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

# చిరుత భయం!

**- చిరుత దాడితోనే ఐదు మేకలు మృతి చెందాయని భయాందోళన**

**- సంఘటనా స్థలంను పరిశీలించిన అటవీశాఖ అధికారులు**



చిరుత దాడిలో మృతి చెందిన మేక!

గుడిపాల, జనవరి 30 ప్రభాతవార్త:

గుడిపాల మండల ప్రజలను చిరుతపులి భయం ఆవరించింది. మండల పరిధిలోని పాలసముద్రం పంచాయతీ అటవీచేను గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతమైన నేరేడు గుండు పరిసరాల్లో గురువారం ఒక్కరోజే ఐదు మేకలు అనుమానస్పదంగా మృతి చెందాయి. ఈ మేరకు చిరుత దాడితోనే మృతి చెందాయని ప్రచారం జరుగుటంతో గ్రామాల్లో నివాసం వుంటున్న ప్రజలు మండలంలోని చిరుతపులి చొరబడిందని భయాందోళన ప్రారంభమైంది. అటవీచేను గ్రామానికి చెందిన రామకృష్ణ మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో రామకృష్ణ బుధవారం అడవికి మేకలు తీసుకెళ్ళాడు అయితే మేకల గుంపు నుండి ఐదు మేకలు ఇంటికి తిరిగిరాలేదు. రాత్రి పూట కావడంతో అడవిలోకి వెళ్ళకుండా గురువారం ఉదయం వెళ్ళి మేకల కోసం గాలించగా నేరేడు గుండు అటవీ ప్రాంతంలో ఐదు మేకలు దాడికి గురై మృతి చెంది పడి వుండటంతో ఈ విషయంను గ్రామస్తులకు తెలిపారు. మేకలు చిరుత దాడితోనే మృతి చెందాయని గ్రామస్తులు తీవ్ర భయాందోళలకు గురయ్యారు. ఈ మేరకు సమాచారంను అటవీశాఖ అధికారులకు చెప్పడంతో డిఆర్ఓ ఆనంద్‌రెడ్డి, బీట్ ఆఫీసర్ ఢిల్లీ రాణి, ఇతర సిబ్బంది మేకలు మృతి చెందిన ప్రాంతంను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ విషయంపై డిఆర్ఓ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ చిరుత మేకలను దాడి చేసిందనే విషయంపై స్పష్టమైన అనవాళ్ళు కన్పించడం లేదని, రేసు కుక్కలు లేదా ఇతర అటవీ జంతువుల దాడిలో మేకలు మృతి చెంది వుండవచ్చునని తెలిపారు. గ్రామస్తులు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ ఢిల్లీ రాణి, ఎబిఓ అరుణ, ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సై అంటే సై !

**మరో 72 గంటలు నరాలు తెగే ఉత్కంఠ**

**-ఒక డిప్యూటీ మేయర్ కోసం అటు భూమన, ఇటు ఆరణి కుస్తీ -నేతల రాజకీయం తేలేది ఫిబ్రవరి 3నే**

ప్రభాతవార్త–తిరుపతి:

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో ఒక డిప్యూటీ మేయర్ ఎన్నిక రాజకీయపార్టీలకు నరాలు తెగే ఉత్కంఠత రేకెత్తిస్తోంది. కౌన్సిల్‌లో పూర్తిస్థాయిలో మెజార్టీ (47మంది )ఉన్న వైసిపి కార్పొరేటర్లులో పదిమంది వరకు గత ఆరునెలలుగా ప్రస్తుత కూటమి అధికార పార్టీ జనసేన పంచన చేరడం సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో చట్టపట్టాలు వేసుకుని తిరుగుతుండటం తెలిసిందే. మరో ఏడాదిపాటు కౌన్సిల్ పదవీకాలం ఉండటంతో ఇంతకాలం ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఛైర్మన్లు, వైస్‌ఛైర్మన్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు పదవులను భర్తీ చేసేందుకు ఆదేశించింది. ఎన్నికల కమిషన్ ఆ దిశగా నోటిఫికేషన్ వెలువడించింది. ఫిబ్రవరి 3వతేదీ పరోక్షపద్దతిలో (ఎంపిక చేసిన నేతకు మద్దతుగా బలాన్ని నిరూపిస్తూ చేతులు ఎత్తేవిధానం)ఎన్నికలకు సిద్దమైంది. ఇందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లకు ఆదేశాలిచ్చింది. ఈ దరిమిలా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో పూర్తిస్థాయి మెజార్టీ బలమున్న వైసిపి 47మంది కార్పొరేటర్లులో డాక్టర్ శిరీష మేయర్, ముద్రనారాయణ డిప్యూటీ మేయర్, భూమన అభినయ్ రెడ్డి మరో డిప్యూటీ మేయర్‌గా కొనసాగుతూ వచ్చారు. గత ఏడాది ఏప్రిల్‌లో తిరుపతి నుండి ఎంఎల్‌గా పోటీలో నిలబడటంతో అభినయ్ రాజీనామాతో ఖాళీఅయిన డిప్యూటీ మేయర్ పదవిని భర్తీ చేయాల్సి ఉంది. ఈ పదవికి ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకుగాను కూటమి తరపున మంత్రి అనగానిసత్యప్రసాద్ నేటి రాత్రికి ఓ హోటల్‌లో కీలకసమావేశం అవుతుండటం ఏం జరగనుందనేది వైసిపి నేతలు పసిగట్టారు.

**-సై అంటే సై:**

మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీ అయిన రెండవ డిప్యూటీ మేయర్ పదవికి ఎన్నిక చేయడం కోసం తాజా రాజకీయపరిణామాలతో అటు బలమున్న వైసిపి, ఇటు అధికారంలో ఉన్న కూటమి జనసేనపార్టీ కుస్తీ పడుతున్నాయి. ఇందుకు కొందరు కార్పొరేటర్లు కొంతకాలంగా జనసేన పార్టీ పంచనచేరడమే వైసిపిలో ఆందోళన కలిగిస్తోంది. 50మంది కార్పొరేటర్లు ఉన్న కౌన్సిల్‌లో 48మంది వైసిపి జెండాపై గెలిచిన వారే కాడం విశేషం కూడా. అయితే వైసిపి మాజీ ఎంఎల్ఎ,ఉభయజిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి తీరుపై అసంతృప్తితో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, పొన్నాలచంద్ర, నరసింహాచారి, ప్రవళిక,అనిల్,కుడితి సుబ్రమణ్యం, కుమారి , నరేంద్రనాథ్ ఇలా కొందరు కూటమివైపు చూస్తున్నారు. తాజా పరిస్థితులతో 30మంది వరకు వైసిపి కార్పొరేటర్లు ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. ఇప్పుడు డిప్యూటీ మేయర్ పదవిని బలమైన నాయకుడు శేఖర్‌రెడ్డికి కట్టబెట్టేందుకు కార్పొరేటర్లు అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. వైసిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా శేఖర్‌రెడ్డి ఖరారుఅయ్యారు. కూటమివైపు నుండి పూర్తిస్థాయిలో మెజార్టీ లేకపోయినా సిట్టింగ్ ఎమ్మెల్యే తనదైన శైలిలో రాజకీయాలు చేసేందుకు సిద్దమై నయానా,భయానా కొందరు కార్పొరేటర్లను భయపెడుతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఫిబ్రవరి 3వతేదీ ఉదయం ఎన్నికలు జరగనుండటంతో మరో 72గంటలు అటు వైసిపి నేతలకు ఇటు కూటమి జనసేన పార్టీనేతలకు నీళ్లుకూడా మింగుడుడని టెన్షన్ పట్టుకుంది. తాజాగా గురువారం ఉదయం వైసిపి నేతలు తమ కార్పొరేటర్లను కూటమి బారినుండి కాపాడుకునేందుకు గోవాకు క్యాంపు తరలించి 3వతేదీ ఉదయం తిరుపతికి చేరుకునేలా పయనమయ్యారు. కూటమిపార్టీల నేతలు ఈ పరిణామాలతో విస్తుపోయి ఉన్న పరువుకూడా పోతుందేమోననే అంతర్మధనంలో పడ్డారు. డిప్యూటీ మేయర్ పదవి వైసిపి భూమనకు, జనసేనపార్టీ ఆరణికి పెద్దసవాల్‌గానే మారింది. ఏదైనా ఊహించని సంఘటనలకు పాల్పడినా పరిస్థితులు చేయిదాటుతాయేమోనని పోలీసు,జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది.

## తిరుమలలో శిలాతోరణం వద్ద

# చిరుతపులి సంచారం



**-సర్వదర్శన క్యూలైన్ వద్ద భయం భయం**

తిరుమల,జనవరి 30ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలలో ఔటర్‌రింగురోడ్డులో శిలాతోరణం వెళ్ళే మార్గంలో సర్వదర్శనం క్యూలైన్ సమీపంలో చిరుతపులి గురువారం రాత్రి సంచరించింది. ఏకంగా క్యూలైన్‌కు పక్కనే ఓ బండపై కూర్చుని ఉండటంతో గమనించిన సిబ్బంది భయంతో పరుగులుతీశారు. ఏకంగా శిలాతోరణం ప్రాంతంలో చిరుతపులి రావడంతో సామాన్యభక్తులు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. సాధారణంగా ఈ ప్రాంతంలో చీకటిపడితే భక్తుల సంచారం కూడా పెద్దగా ఉండదు, రద్దీ ఎక్కువైతే క్యూలైన్‌లు ఔటర్‌రింగురోడ్డు వరకు విస్తరిస్తాయి. మరీ అడవిని వదలి జనావాసాల్లోకి వచ్చిన చిరుతను బందించాలని భక్తులు కోరుతన్నారు.

# ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనంకు పాల్పడిన ఇద్దరు అరెస్టు

**- రూ.19.42 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలు స్వాధీనం - డిఎస్పీ సాయినాథ్**



చిత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త:

చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దొడ్డిపల్లిలోని ఓ ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో తాళాలు పగులగొట్టి ఇంట్లో నుండి 19.42 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలను దోచుకెళ్ళిన ఇద్దరు దొంగలను వన్‌టౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ జయరామయ్య ఆధ్వర్యంలో పోలీసులు పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన షేక్ మొహియుద్దీన్(32), కడప జిల్లా రైల్వే కోడూరు ఎస్టీ కాలనీకి చెందిన ఎం.మణికంఠ(43)లను అరెస్టు చేశారు. చిత్తూరు డిఎస్పీ సాయినాథ్ గురువారం చిత్తూరు వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ దొంగతనం కేసు వివరాలను వివరిస్తూ ఈ నెల 17వ తేదీ రాత్రి దొడ్డిపల్లిలోని ఎంజి సెల్వరాజ్ ఇంటి తాళాలు పలులగొట్టి దొంగలు ఇంట్లో వున్న బంగారు, వెండి నగలను దోచుకెళ్ళారన్నారు. ఈ మేరకు ఎంజి సెల్వరాజ్ చిత్తూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్పీ మణికంఠ చందోలు ఈ దొంగతనం కేసును సీరియస్‌గా పరిగణించి తన పర్యవేక్షణలో రెండు బృందాలను ఏర్పాటు చేశారన్నారు. చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ జయరామయ్య ఆధ్వర్యంలో ఒక బృందం, చిత్తూరు క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఒక బృందం ఏర్పాటు చేసి దర్యాప్తును ముమ్మరం చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో దొడ్డిపల్లిలో సెల్వరాజ్ ఇంట్లో దొంగతనానికి పాల్పడినది కడప జిల్లా రైల్వే కోడూరు ఎస్టీ కాలనీకి చెందిన ఎం.మణికంఠ, పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన షేక్ మొహియుద్దీన్‌లు అని నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో దొడ్డిపల్లిలోని ఇంట్లో దొంగతనం చేసిన ఇద్దరు నిందితులు షేక్ మొహియుద్దీన్, ఎం.మణికంఠలు గురువారం తమిళనాడు రాష్ట్రంలోని కాట్పాడిలోని కింగ్‌స్టన్ కళాశాల సమీపంలో వున్నట్లు చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ జయరామయ్యకు కచ్చితమైన సమాచారం అందిందన్నారు. ఈ మేరకు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ జయరామయ్య అధ్వర్యంలో పోలీసులు వెళ్ళి వారిని అరెస్టు చేసి దర్యాప్తు చేయడంతో వారి నుండి 238.5 గ్రాముల బంగారం, 65 గ్రాముల వెండితో పాటు 4.06 లక్షల రూపాయల నగదు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. వారి నుండి స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి అభరనాల విలువ 14.36 లక్షల రూపాయలు వుంటుందన్నారు. అలాగే వీరు దొంగలించిన నగదుతో 3 సెల్‌ఫోన్లు, ఒక వాచ్ కొనుగోలు చేశారని వీటి విలువ ఒక లక్ష రూపాయలు వుంటుందన్నారు. అలాగే వీరు దొంగతనానికి పాల్పడిన ఒక స్కూటర్‌ను సైతం పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. పోలీసుల విచారణలో వీరు తాళం వేసిన ఇళ్ళను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వీరిపై ఇప్పటికే పలు కేసులు వున్నట్లు తేలిందన్నారు. ఈ కేసును అనతికాలంలోనే చేధించిన వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ జయరామయ్య, వన్‌టౌన్ సిబ్బందిని ఎస్పీ మణికంఠ చందోలు అభినందించి రివార్డు ప్రకటించడం జరిగిందన్నారు. ఈ దర్యాప్తులో ఇన్స్‌పెక్టర్ జయరామయ్యతో పాటు ఎఎస్ఐ ఇ.దేవరాజులు, కానిస్టేబుళ్ళు కె.సుధాకర్, సి.రమేష్, కె.రవిరెడ్డిలు పాల్గొన్నారని వీరిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారన్నారు.



శవపేటికను తీసుకెళ్ళటానికి యువత పడుతున్న తిప్పలు

# శ్మశానం లేక తిప్పలు: దారిలేక ఇక్కట్లు

**జింగిలిపాళెం వాసుల కడగండ్లు**

శ్రీకాళహస్తిరూరల్,జనవరి 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలంలోని పలు గ్రామాల్లో శ్మశానానికి చోటు లేదు. మరి కొన్ని శ్మశానాలకు వెళ్ళటానికి దారి లేదు. శ్మశానం ఉంటే దారి లేదు. దారి ఉంటే శ్మశానం కు స్థలం లేక తిప్పలు పడుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి సమీపంలో జింగిలిపాళెం గ్రామం ఉంది.ఈ గ్రామంలో ఎవరైనా చనిపోతే పూడ్చటానికి శ్మశానం లేదు. ఎవరు చనిపోతే వారి పొలాల్లో దహనం, ఖననం చేసుకోవాల్సిందే. అయితే వర్షాకాలం, పంటల కాలంలో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.ఈ నేపధ్యంలో గురువారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆతన్ని వారి పొల్లాల్లో పాతిపెట్టడానికి తీసుకెళ్ళటానికి కూడా దారి సదుపాయం లేదు. దాంతోశవపేటికను తీసుకెళ్ళటానికి యువత పడ్డ తిప్పలు వర్ణనాతీతంగా మారింది. రెవెన్యూ సదస్సుల్లో ఈ సమస్యను అధికారుల దృష్టికి తెచ్చారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులకు ఈ సమస్యను వివరిస్తున్నారు.కానీ పరిష్కారం దొరకటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో స్మశానాలకు స్థలాలు కేటాయించాలని యువత కోరుతుంది.

## పల్లె పండుగ పనులు

## ఫిబ్రవరి నెల ఆఖరిలోగా పూర్తి కావాలి



వీడియో కాన్ఫెరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

తిరుపతి కలెక్టరేట్, జనవరి 30 ప్రభాతవార్త :

పల్లె పండుగ కార్యక్రమంలో జిల్లా అభివృద్ధికి కేటాయించిన పనులను పురోగతి ఉండాలని, ఎలాంటి అలసత్వం వహించరాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ నుంచి పంచాయితీ రాజ్, డ్వామా అధికారులతో పల్లె పండుగలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనుల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమానికి గ్రామ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం కింద మంజూరు కాబడిన అభివృద్ధి పనులలో పురోగతి ఉండాలని లక్ష్యం మేరకు ఇంజనీరింగ్ పనులు, సీసీ రోడ్ల నిర్మాణం, అనిమల్ షెడ్స్ తదితర పనులను వేగవంతం చేయాలన్నారు. పల్లె పండుగ కార్యక్రమం క్రింద మంజూరు కాబడిన పనులునాణ్యతతో ఉండాలని తెలిపారు. జిల్లాలో వంద కోట్ల రూపాయలకు సంబంధించిన పనులు పెండింగ్‌లో ఉన్నాయని, పనులలో ఎలాంటి అలసత్వం ఉండరాదని ఫిబ్రవరి నెల ఆఖరికి పూర్తి పనులు కావాలని ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్, ఎంపీడీవోలు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.


## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాపిడ్ టాస్క్‌ఫోర్స్ టీం ఆకస్మిక తనిఖీ



కేవీబీ పురం, జనవరి 30 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలోని కోవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పెరిందేశం గ్రామంలో గురు వారం విలేజ్ హెల్త్ క్లినిక్‌లో రోగులకు అందుతున్న వైద్య సేవలను తిరుపతి జిల్లా రాపిడ్ టాస్క్‌ఫోర్స్ టీం గురువారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీపీఎంవో నాగేంద్ర మాట్లాడుతూ గర్భిణీలకు, పిల్లలకు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. సీజనల్ వ్యాధులపై అందరికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అనంతరం కోవనూరు ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను తనిఖీలు నిర్వహించారు. డా. శ్రీనివాసరావు, డీపీఎంవో నాగేంద్ర, ఎస్‌వో నరేష్, సూపర్‌వైజర్ ప్రకాష్, డీపీవో కోవనూరు ప్రాథమికఆస్పత్రి వైద్యులు జగదీష్, వేణు, భారతి, గవాస్కర్‌లు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరుని కల్యాణోత్సవం



వడమాలపేట, జనవరి 30 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున స్వామివారికి కల్యాణం జరిపించడం ఆనవాయితీ. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. పద్మావతి, ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, పూలమాలలతో నూతన వధూవరులుగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు ఆధ్వర్యంలో అగ్నిహోమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామ స్మరణాల నడుమ వేదమంత్రాలతో మాంగళ్యధారణ చేయించారు.

## మాజీ అటవీ మంత్రి అడవినే మింగేయడం దారుణం

**-ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**



పలమనేరు,జనవరి 30,ప్రభాతవార్త:

గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేను మేస్తే ఆ ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన మాజీ మంత్రి,ప్రస్తుత పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి కంచె మేసారని అందుకు నిదర్శనమే ఆయన అటవీ భూమి ఆక్రమణ అని అమరనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అప్పటి అటవీశాఖ మంత్రి ఆయన శాఖలోనే వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు.పుంగనూరు నియోజకవర్గం పులిచర్ల మండలం మంగళంపేట అడవుల్లో గత ఐదేళ్ల వైకాపా పాలనలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమ అటవీ సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. పెద్దిరెడ్డి వారి కుటుంబీకులు చేసిన అక్రమాలపై ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ జరపాలన్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయ అగ్ని ప్రమాదం సంఘటనలో ఆయన పాత్రపై ఆరోపణలు ఉన్నాయని,అటవీ భూమి ఆక్రమించలేదన్న ఆయన కొన్న భూమి సర్వే చేపట్టి మిగిలిన భూమి ఆయన ప్రభుత్వనికి అప్పగించాలని సూచించారు.అటవీ శాఖ,రెవెన్యూ శాఖ అధికారులు పూర్తి స్థాయి సర్వే చేపట్టి ఆయన కొనుగోలు చేసిన భూములు తేల్చి మిగిలిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్నభోజన తయారి తీరు మారదా? : బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని కొన్ని పాఠశాలలకు సరఫరా అవుతున్న భోజనం నాసిరకంగా ఉందని దానివల్ల విద్యార్థులు దానిని చెత్తబుట్టల్లో వేస్తున్నారని గమనించిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ అవాక్కయ్యారు. గురువారం ఆమె శ్రీకాళహస్తి పట్టణం పరిధిలోని కొత్తపేటలో ఉన్న జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సరఫరా చేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మమేకమయ్యారు. అయితే అక్కడ ఓ మోస్తరుగా ఉండటం గమనించారు. అయితే మున్సిపల్ బాబూ అగ్రహారం ఉన్నత పాఠశాలలో పరిశీలించినపుడు విద్యార్థులు భోజనాన్ని తీసుకొని తినలేక చెత్తబుట్టలో వేయటం గమనించిన ఆమె విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గతంలో కూడా ఆమె పానగల్‌లోని ఆర్‌పిబియస్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భోజనం పరిశీలించి ఆశ్చర్యపోయారు. ఆ రోజు బిరియానిని సంగటిలా తయారు చేసి పంపి ఉండటంతో సునిశితంగా హెచ్చరించారు. తీరు మార్చుకోవాలని విద్యార్థులకు అందించే భోజనం తయారిలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గురువారం మున్సిపల్ ఉన్నతపాఠశాలకు కూడా అదే కాంట్రాక్టర్ సరఫరా చేస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ మేరకు వెంటనే ఆమె ఎంఇఓ బాలయ్యను అక్కడకు పిలిపించారు. ఆయనకు విద్యార్థులు డస్ట్‌బిన్‌లో పడేసిన అన్నాన్ని చూపారు.ఇలా అయితే మీరెందుకు తనిఖీ చేయటం లేదని నిలదీశారు. ఇక్కడ పని చేసే ఉపాధ్యాయులను కూడా భోజనం నాసిరకంగా ఉంటూ విద్యార్థులు తినటానికి వీల్లేకుండా ఉంటే మీరెందుకు అధికారుల దృష్టికి తీసుకురాలేదని ప్రశ్నించారు.అలాగే ఈ పాఠశాలలోని బాత్‌రూంలలో కొళాయిలు లీకేజీ గురించి విద్యార్థులు ఫిర్యాదు చేసారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని బృందమ్మ సూచించారు.

## జనసేన భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

సోమల, జనవరి 30, ప్రభాతవార్త



సోమల జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఆదివారం నిర్వహించే జనసేన పార్టీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలంటూ ఆ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణంలో గురువారం బహిరంగ సభ జరిగే ప్రదేశాన్ని ఆయన పరిశీలించి నాయకులకు, కార్యకర్తలకు పనులు సూచనలు చేశారు. భారీ బహిరంగ సభకు కొణిదల నాగబాబు ముఖ్యఅతిధిగా హాజర వుతున్నారని అన్నారు. బహిరంగ సభను జయప్రదం చేయాలంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి చిన్న రాయల్, శివకుమార్ రెడ్డి, విరూపాక్ష, జనసేన పార్టీ మండల కన్వీనర్ సూరిశెట్టి నాగభూషణం, బండారు రఘు, ఖలీల్, విజయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో అమర వీరుల దినోత్సవం

కుప్పం, జనవరి 30 ప్రభాతవార్త



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో గురువారం షహీద్ దివస్ (అమరవీరుల దినోత్సవం)ను నిర్వహించారు. బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ ఈసందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ అమరవీరుల దినం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఆంగ్లేయులపై స్వాతంత్ర్య పోరాటానికి మహాత్మాగాంధీ నాయకత్వంలో చేపట్టిన పోరాటం సఫలమై దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. విద్యార్థులు మహనీయుల అడుగు జాడల్లో నడవాలని వారి సేవలను మరువరాదని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు మాధవన్, గంగాధర్, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రామకుప్పం,జనవరి 30 ప్రభాతవార్త



సమాజంలో ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ బాబు సూచించారు. గురువారం బందార్లపల్లి పంచాయతీ గద్దూరు గ్రామంలో పౌర హక్కుల దినోత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలిపారు. దళిత వాడల్లో సమస్యల పరిష్కారంకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగేలా చూస్తామన్నారు. దళిత, గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడ్తామన్నారు. అనంతరం వివిధ సమస్యలపై చర్చించారు. సమావేశంలో సర్పంచ్ రాజగోపాల్, ఎంపిడిఓ మురళీధర్‌రెడ్డి, నేతలు మునిరెడ్డి, సతీష్, జనసేన భాస్కర్, దళిత నేతలు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ మృతి.. ఘన నివాళులు

రామకుప్పం, జనవరి 30 ప్రభాతవార్త



మండలంలోని వీర్నమల పంచాయతీ మాజీ సర్పంచ్ పెద్దబ్బనాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఘన నివాళులు అర్పించారు. పెద్దబ్బనాయుడు పార్టీకి, పంచాయతీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నేతుల మునస్వామి, ఆనందరెడ్డి,నరసింహులు, చిన్నికృష్ణ, చలపతి, కృష్ణానాయక్, గంట్లప్పగౌడు, పాండ్యన్, జేయి, రవి, సత్తి పాల్గొన్నారు.

## 9.2లక్షల వేతనంతో ఉద్యోగానికి పాలిటెక్నిక్ విద్యార్థిని

కుప్పంరూరల్, జనవరి 30 ప్రభాతవార్త



కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో ఫైనలియర్ చదువుతున్న తేజశ్రీ అనే విద్యార్థిని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 9.2లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జగన్నాధరావు తెలిపారు. అలాగే తేజశ్రీకి ప్రతిష్టాత్మక బిట్స్ పిలానీలో బిటెక్ చదివే అవకాశం సైతం కల్పిస్తుందన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో 15మంది మా త్రమే ఉద్యోగాలకు ఎంపికకాగా వారిలో తమ విద్యార్థిని ఉ ఒడడం గర్వకారణమన్నారు. ఈసందర్భంగా తేజశ్రీని అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఒడిలు రామకృష్ణరావు, సుబ్బన్న, అధ్యాపకులు రమేష్, సుజాత, శిరీష, రాధ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నివారణపై ర్యాలీ

బంగారుపాళ్యం, జనవరి 30 ప్రభాతవార్త:



జాతీయ కుష్టువ్యాధి నివారణ దినోత్సవంను పురస్కరించుకుని గురువారం బంగారుపాళ్యంలో వైద్య ఆరోగ్యశాఖ, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రహదారిపై ర్యాలీ నిర్వహించి కుష్టువ్యాధి నివారణపై నినాదాలు చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ మాట్లాడుతూ కుష్టువ్యాధి గ్రస్తులను ద్వేషించడం చేయరాదన్నారు. వారితో ప్రేమగా మెలుగుతూ వారి బాధలను తీర్చాలన్నారు. సకాలంలో మందులు వాడితే కుష్టు వ్యాధిని నయం చేయవచ్చునన్నారు. ప్రతి ఇంటి వద్దకు వైద్య సిబ్బంది వచ్చి ఎల్‌సిడిసి సర్వే చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ శిరీష్, డాక్టర్ రమేష్, డిపిఎంఓ మణి, సూపర్‌వైజర్ హరికృష్ణ, ఎంపిహెచ్ఓ రమేష్‌బాబు, అముద, పలువురు ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## గుండె రక్షణపై అవగాహన

బంగారుపాళ్యం, జనవరి 30 ప్రభాతవార్త:




స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి ఆవరణలో గుండె రక్షణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిణి డాక్టర్ శిరీష మాట్లాడుతూ గుండె నొప్పితో ఆసుపత్రికి వచ్చే వారికి వెంటనే ఇసిజి చేపట్టి నొప్పి నిర్ధారణ చేస్తామన్నారు. ఒక గంటలోపు రక్తం గడ్డకట్టకుండా వుండటానికి టెనిక్ ప్లస్ ఇంజెక్షన్ రోగికి ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనివల్ల గుండెపోటు వచ్చిన రోగిని త్వరగా డాక్టర్ వద్దకు గంటలో తీసుకువెళ్ళవచ్చునని ఎలాంటి ప్రాణాపాయం వుండదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు షాలినీ, స్వరూప్‌నాయక్, భార్గవ్, భావన, విజయకుమారి, హెడ్‌నర్స్ సుమతి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల శుభ్రతతోనే కుష్టు వ్యాధి నివారణ

కల్లూరు, జనవరి 30, ప్రభాతవార్త



పులిచెర్ల మండలంలోని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి జానకి రావు ఆధ్వర్యంలో గురువారం కల్లూరులో జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టు వ్యాధి ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి జానకిరావు కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కల సంరక్షణతోనే పచ్చదనం పెంపొందించుకోవచ్చు

కల్లూరు, జనవరి 30, ప్రభాతవార్త



పులిచెర్ల మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాఠశాల ఆవరణంలో నేషనల్ గ్రీన్ కోర్ ఎకో క్లబ్ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వనపర్తి వెంకట సిద్ధులు ఆధ్వర్యంలో మనం ఒక మొక్క నాటితే ఒక చుక్క వర్షం కురుస్తుంది అనే నినాదంతో ఎన్‌సిసి విద్యార్థులచే మొక్కలు నాటించారు. ముఖ్య అతిథులుగా జడ్పిటిసి సభ్యులు మురళీధర్, సర్పంచ్ షుకూర్, పాఠశాల కమిటీ ఛైర్మన్ అష్రఫ్ విచ్చేసి మొక్కలు నాటినట్లు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులు, గ్రీన్ మాస్టర్ వనపర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సహపాఠ్యాంశ కార్యక్రమాలలో భాగస్వాములై పాఠశాల తోటను ఆకుపచ్చ హరితవనంగా తీర్చిదిద్దడంలో తమ వంతు కృషి చేసి, ఆరోగ్యవంతమైన పరిసరాలలో విద్యనభ్యసించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, ఈశ్వరయ్య, మహమ్మద్‌రఫీ, రాజశేఖర్, సుభాషిని, సైదుల్లా, హసీనాబీ, విమలా విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కాలనీల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి : జెసి విద్యాధరి

చౌడేపల్లి, జనవరి 30 ప్రభాతవార్త



ఎస్టీ కాలనీల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. గురువారం మండలంలోని దిగువపల్లి, వెంగళపల్లి పంచాయతీల్లోని నెట్టిగుంట, నరసాపురం యానాది కాలనీలను సందర్శించారు. గత పర్యటనలో భాగంగా తాను ఆదేశించిన యానాది కాలనీకి రోడ్డు, మంచినీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పన ఆరా తీశారు. అదే విధంగా ఆధార్ కార్డులు పంపిణీపై అడిగి తెలుసుకొన్నారు. అధికారులు అన్ని వసతులు సమకూర్చినట్లు నెట్టిగుంట యానాదులు జెసికి వివరించారు. మంచినీటి పైపులైన్లు, రేషన్‌కార్డుల మంజూరు చేయాలని వారు జెసి విద్యాధరిని కోరారు. కాలనీలోని అందరికీ ప్రభుత్వ నిర్ధేశిత 3సెంట్ల ఇళ్ళ స్థలాలను మంజూరు చేయాలని తహశీల్దార్ హనుమంతును ఆదేశించారు. అదే విధంగా గ్రామానికి రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని నరసాపురం యానాదులు ఆమెతో మొరపెట్టుకొన్నారు. మండల సర్వేయర్ గుణశేఖర్, ట్రాన్స్‌కో, రెవిన్యూ అధికారులు, యానాదులు పాల్గొన్నారు.

## మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

– ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, జనవరి 30 ప్రభాతవార్త



బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వారి నుంచి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు కృషి చేసిన మహాత్మాగా ంధీ అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఉందని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం మహాత్మాగాంధీ 77వ వర్థంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఆయన గాంధీ చిత్రపటానికి పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. ఇరవయ్యవ శతాబ్దంలో మానవాళిని అత్యధికంగా ప్రభావితం చేసిన వ్యక్తుల్లో మహాత్మా గాంధీ ఒకరనిఆయన పేర్కొన్నారు. తాను నమ్మిన సిద్ధాంతాలను ఆచరించి దేశంపై చెరగని ముద్ర వేశారని కొనియాడారు. అటువంటి మహనీయుడు ఆశయసాధనకోసం అందరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

– వైకాపా రాష్ట్ర నేత హెచ్ఎం శ్రీను

కుప్పం, జనవరి 30 ప్రభాతవార్త



ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఎన్డీయే ప్రభుత్వం అమలు చేయాలని రాష్ట్ర వైకాపా వన్నియకులక్షత్రియ విభాగం అధ్యక్షుడు హెచ్ఎం శ్రీను రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్సీ భరత్ క్యాంప్ కార్యాలయంలో ఆయన జిల్లా వైకాపా ఉపాధ్యక్షుడు కోదండరెడ్డితో కలసి మీడియాతో మాట్లాడారు. ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. ఎన్నికలకు ముందు వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ చెప్పిన మాటలు నేడు నిజం అని జనం గుర్తు తెచ్చుకుంటున్నారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందని పథకాలు అమలు చేయకుంటే ప్రజల పక్షాన తాము పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం వచ్చిన నాటినుంచి 1.19లక్షల కోట్ల అప్పులు తీసుకున్నారన్నారు. వాలంటీర్లు మొదలు చాలావరకు లక్షలాది మందిని ఉద్యోగాలనుంచి తొలగించడం భావ్యం కాదన్నారు. సమావేశంలో నేతలు బాబురెడ్డి, చంద్రారెడ్డి, దండపాణి, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు

యర్రావారిపాలెం, జనవరి 30 ప్రభాతవార్త




బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని యర్రావారిపాలెం ఎస్ఐ డి.వై. స్వామి తెలిపారు. గురువారం యర్రావారిపాలెం మండల పరిధిలోని నెరబైలు పంచాయితీ, బోడేవాండ్లపల్లి పంచాయితీ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి పడవేసిన చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే జరిమానాలతో పాటు, చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. వాహన చోదకులు మద్యం సేవించివాహనాలునడపరాదని అన్నారు.పోలీసు సిబ్బంది, పంచాయితీ కార్యదర్శి, ప్రజలు పాల్గొన్నారు.

## తెదేపా కార్యాలయంలో గాంధీకి ఘన నివాళులు



**శాంతిపురం, జనవరి 30 ప్రభాతవార్త** స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్థంతిని నిర్వహించారు. ఈసందర్భంగా గాంధీ చిత్రపటానికి నాయకులు పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథ నాయుడు, నేతలు నాగరాజు, రమేష్, బాలు, రామకృష్ణప్ప పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గంటావూరులో నకిలీ పట్టాల నిగ్గు తేల్చండి

–రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అదేశాలు

పలమనేరు,జనవరి 30,ప్రభాతవార్త:



పలమనేరు పట్టణంలోని గంటావూరు కాలనీలో నకిలీ పాట్టాలపై నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంటావూరు ఇందిరమ్మ కాలనీ అక్రమాలను వెంకటనే నిగ్గు తేల్చాలని తెలిపారు.అధికారుల అలసత్వంతో అక్రమార్కులు పెట్రేగిపోతున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇప్పటికే చేపట్టిన విచారణలో గుర్తించిన ఖాళీ స్థలాలను అర్హులకు అందించేలా చర్యలు తీసుకోవాలని,అక్రమాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించవద్దన్నారు.నకిలీ పట్టాల బాగోతాన్ని సైతం బయటపెట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,ఇప్పటికే ఇతర ప్రాంతాల వారితో గంటావూరు కాలనీ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందని అసహనం వ్యక్తం చేశారు.క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలన చేపట్టి పారదర్శకంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇన్బనాధన్,మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## అహింసను ఆయుధంగా అందించిన జాతిపిత

చౌడేపల్లి, జనవరి 30 ప్రభాతవార్త



అహింసా అనే ఆయుధాన్ని జాతికందించిన మహనీయుడు మహాత్మాగాంధీ అని పలువురన్నారు. గురువారం గాంధీజీ 77వ వర్థంతి సందర్భంగా ఉన్నత పాఠశాల వద్దగల ఆయన విగ్రహానికి వాసవీ–వనితాక్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఇస్సానాగలక్ష్మి, ఆర్యవైశ్య సంఘ సేవకుడు రంగనాథ్‌బాబు, ఐఎం రామ్‌కుమార్, వాసవీ–వనితాక్లబ్ అధ్యక్షులు అమరావతి శ్రీనాథ్, రంగవల్లి, కార్యదర్శి నాగలక్ష్మి, కోశాధికారులు వాణి, అమరనాథ్, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దాం : పవన్‌కుమార్

చౌడేపల్లి, జనవరి 30 ప్రభాతవార్త



గాంధీజీ కలలు కన్న కుష్ఠువ్యాధి నిర్మూలనకు కృషి చేద్దామని మండల వైద్యాధికారి పవన్ కుమార్, ఎంఇఓ కేశవరెడ్డిలన్నారు. ప్రపంచ కుష్ఠు వ్యాధి నిర్మూలనా దినోత్సవాన్ని పురష్కరించుకొని దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లిలో అవగాహనా ర్యాలీ జరిగింది. స్పర్శలేని తెలుపు, రాగి వర్ణంలోని వున్న మచ్చలు, నరాలు గడ్డలు కట్టడం వంటి లక్షణాలుంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందనీ, మరే ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎలాంటి చికిత్సలుండవన్నారు. ప్రధానోపాధ్యాయురాలు జామ్రూదాజాన్, సూపర్‌వైజర్ బాహుద్దీన్, ఎంఎల్‌హెచ్‌పి నాగలక్ష్మీ, ఎఎన్ఎం సునీత, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైకాపా అనుబంధ విభాగంలో ముగ్గురికి చోటు

చౌడేపల్లి, జనవరి 30 ప్రభాతవార్త

పుంగనూరు నియోజకవర్గ అనుబంధ విభాగంలో చౌడేపల్లి మండలానికి చెందిన ముగ్గురికి చోటు లభించింది. నియోజకవర్గ ఎస్సీసెల్ విభాగంలో చిట్రెడ్డిపల్లికి చెందిన డాబాల రెడ్డెప్ప, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు లద్దిగం లాజర్, లీగల్ సెల్ విభాగంలో కాటిపేరి ఎస్.సుధాకర్‌రెడ్డిలకు చోటు కల్పిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి నుంచి ఉత్తర్వులు అందినట్లు వైకాపా వర్గాలు తెలిపాయి.

## 3న శ్రీవీరాంజనేయ స్వామి బాలాలయ ప్రతిష్ట

కాణిపాకం, జనవరి 30 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం ప్రాంగణంలో శ్రీవీరాంజనేయస్వామి బాలాలయ ప్రతిష్ట మహోత్సవంను ఫిబ్రవరి 1 నుండి 3 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ప్రస్తుతం వున్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయానిన్ని పడగొట్టి రాతితో సుమారు రూ.1.10 కోట్లు వ్యయ అంచనాలతో పునర్నిర్మాణం చేయడానికి అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు ముందుకు వచ్చారు. దీనితో ఆలయ నిర్మాణ పనులకు సంబందించి ఇదివరకే భూమిపూజ కూడా చేశారు. ఈమేరకు ఆలయాని న్ని పడగొట్టడానికి వీలుగా బాలాలయం ఏర్పాటు చేయనున్నారు. ఈపూజలు ఫిబ్రవరి 1న సాయంత్రం ప్రారంభమై 3న తెల్లవారుజామున వరకు మూడు రోజుల పాటు జరుగనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు, పరిసర గ్రామస్థులు, ఆలయ ఉభయదారులు తప్పక పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టంను సద్వినియోగం చేసుకోవాలి

కాణిపాకం, జనవరి 30 ప్రభాతవార్త:

ఇంటి దొంగతనాల నివారణకు ప్రజలు లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాణిపాకం ఎస్సై ధరణీధర తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్ళిన సమయంలో ఇంటి దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని అరికట్టేందుకు వీలుగా ఇంటికి తాళం వేసి వెళ్ళే వారు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. తద్వారా ఇంటి వద్ద లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దొంగతనాలు జరుగకుండా నివారించడం జరుగుతుందన్నారు. అలాగే అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే వారి వివరాలను సేకరించడంతో పాటు వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలని ధరణీధర తెలిపారు. తద్వారా నేరాలు జరుగకుండా నివారించవచ్చునని తెలిపారు. ఇంట్లోని విలువైన వస్తువులు,నగదు, బంగారంను సక్రమంగా భద్రపరచిన తర్వాతనే ఇంటి నుండి బయటకు వెళ్ళాలని ఎస్సై సూచించారు.

## గణనాధుని సన్నిధిలో స్త్రసీ శిశుసంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి

కాణిపాకం,జనవరి 30 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి సూర్యకుమారి గురువారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.ఆమెకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు పాల్గొన్నారు.

---

## రథసప్తమిన

తిరుమల–తిరుపతి మధ్య 2,100 ట్రిప్పులు

–సురక్షిత ప్రయాణమే ధ్యేయం

–డిపిటిఓ నరసింహులు

తిరుపతి(రవాణ),జనవరి 30ప్రభాతవార్త:



రథసప్తమి పర్వదినం ఫిబ్రవరి 4వతేదీ ఒకేరోజు ఏడువాహనసేవల వీక్షణకు లక్షలాదిమంది భక్తులు తిరుమలకు వచ్చే వీలున్నందున ,అందుకు తగ్గట్లు ఆర్టీసి బస్సులు నడిపి ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చుతామని తిరుపతి డిపిటిఓ జి.నరసింహులు తెలిపారు. ఇందుకు తిరుమల–తిరపతి మధ్య 2,100 ట్రిప్పులు ఆర్టీసి బస్సులను నడిపి భక్తులను తిరుమలకు తిరిగి తిరుపతికి చేర్చడం జరుగుతుందన్నారు. సాధారణరోజుల్లోనే 1,500వరకు ట్రిప్పులు తిప్పడం జరుగుతుందన్నారు. ఆ రోజు వివిధ బస్టాండులలో రద్దీని పర్యవేక్షించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సీనియర్ అధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇతర రాష్ట్రాల బస్సులు కూడా తిరుపతికి నడిపేలా సూచనలు చేశామన్నారు. రథసప్తమిన భక్తులకు అసౌకర్యం లేకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

## గోవిందపూర్ హాట్సన్‌లో

కిడ్స్ అడ్వెంచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్

తిరుపతి,జనవరి 30ప్రభాతవార్త:



గోవిందపూర్‌హాట్సన్ ఫ్యాక్టరీలో సంస్థ ఉత్పత్తులపై కిడ్స్‌అడ్వెంచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ నిర్వహించి, అవగాహన కల్పించడం జరిగిందని హాట్సన్ ఆగ్రో ప్రోడక్ట్స్ ఛైర్మన్ పద్మశ్రీ ఆర్‌జి చంద్రమోగన్ తెలిపారు. ఉత్పత్తి మైలురాయిచేరుకోవడం వెనుక కార్యకలాపాల్లో అధునాతన సాంకేతికత స్థిరత్వం నిబద్దత దోహదపడిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యర్రకమాలను నిర్వహించి, విద్య వినోదాన్ని కలిపి పిల్లలను స్థిరత్వం కోసం ఎదరుచూస్తున్నామన్నారు. పర్యావరనణ హితమైన పద్దతులు పాటిస్తూ అధిక నాణ్యత గల ఉత్పత్తులను అందించడంపై దృష్టి సారించినట్లు హాట్సన్ యాజమాన్యం తెలిపింది.

## విరించి 2025 బ్రోచర్ ఆవిష్కరణ

తిరుపతి విద్య, జనవరి 30 ప్రభాత వార్త




పద్మావతి మహిళా వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో మార్చి 12వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరిగే విరించి 2025 జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్ను వీసీ ప్రొఫెసర్ ఉమ గురువారం ఆవిష్కరించారు. ఈ సదస్సులో ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అన్ని విభాగాలు నాన్‌టెక్నికల్ ఈవెంట్ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజిని, ఎసీఈటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున, కన్వీనర్ డి నర్మిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్వీయూ డీడీఈ పరీక్షలు వాయిదా

తిరుపతి విద్య జనవరి 30 ప్రభాత వార్త

ఎస్వీయూ డీడీఈ పరిధిలో వచ్చేనెల 3వ తేదీ నుంచి నిర్వహించాల్సిన యూజీ,పీజీ,డిప్లొమో పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు డీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ తవమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.వీసీ సీహెచ్ అప్పారావు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేశారు.పరీక్షల నిర్వహణపై త్వరలో నిర్ణయించి తేదీలను వెల్లడిస్తామని పేర్కొన్నారు.పరీక్షలు జరగనున్న సుమారు 43 స్టడీసెంటర్లకు ఇప్పటికే సమాచారం అందించామని, విద్యార్థులు గమనించి సహకరించాలని సూచించారు.

## గాంధీకి నివాళులు

తిరుపతి(రవాణ),జనవరి 30ప్రభాతవార్త:



మహాత్మాగాంధీ వర్దంతిని బిజెపి నాయకులు గురువారం నగరంలోని గాంధీవిగ్రహం వద్ద జరుపుకున్నారు. ఆయన విగ్రహానికి బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఆంజనేయులు, చంద్రశేఖర్, కస్పాపద్మనాభం, ఉపాధ్యాయుడు తిరుమలయ్య, ఆదిస్వామి తదితరులు పుష్పాంజలి ఘటించారు.

## సైబర్ నేరాలు స్వీయ రక్షణపై అవగాహన కార్యక్రమం

తిరుపతి విద్య జనవరి 30 ప్రభాత వార్త



శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో సైబర్ నేరాల పైన అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి అధ్యక్షతన నిర్వహించడమైనది. ప్రిన్సిపల్ మాట్లాడుతూ హానికరమైన సైబర్ కార్యకలాపాలు ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పును కలిగింపజేస్తున్నాయో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో కొన్ని ఉదాహరణలతో వివరిస్తూ పోలీస్ శాఖ వారి ద్వారా ప్రతి విద్యార్థిని ఈ కార్యక్రమాన్ని అవగాహన చేసుకుని దైనందిన జీవితంలో మెలకువగా వుండాలని కోరారు. మహిళా పోలీస్ స్టేషన్ సి ఐ తమీమ్ అహ్మద్ కంప్యూటర్ ఆధారిత సైబర్ నేరాలే కాకుండా సెల్ ఫోన్ ద్వారా కూడా ఎలాంటి మోసాలకు పాల్పడుతున్నారో ఇతరత్రా ఓటీపీలు ఏవి వచ్చినా ఎలాంటి మెలకువలు పాటించాలో మొబైల్ లో వచ్చే ఇతరత్ర లింకుల పైన సమగ్ర అవగాహన కల్పిస్తూ అమ్మాయిల భద్రతా విషయాల పైన విద్యార్థినిలకు జరిగిపోయిన ప్రస్తుతం జరుగుతున్న అంశాలపై క్లుప్తంగా సోదారణంగా వివరించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ దీపిక మాట్లాడుతూ అమ్మాయిలు అంతర్జాలంలో కానీ సామాజిక మాధ్యమాల ద్వారా ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో ముఖ్యంగా ఇంటర్మీడియట్ దశలో ఏ విధంగా నడుచుకోవాలో లక్ష్యంతో ఎలా ముందుకెళ్లాలో తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

## వాడ వాడల్లో జాతిపితకు నివాళులు



శ్రీకాళహస్తి,జనవరి 30 ప్రభాతవార్త శ్రీకాళహస్తిలోని వాడ వాడల్లో జాతిపిత మహాత్మాగాంధీ వర్థంతిని రాజకీయాలకు అతీతంగా నిర్వహించారు. గురువారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మదుసూధనరెడ్డి సారధ్యంలో ఇనగలూరు గ్రామంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి కోసం దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు జాతిపిత అన్నారు. ఆయన బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.గ్రామస్థులు మాజీ ఎంఎల్ఏకు ఘనస్వాగతం పలికారు.

## మహాత్మ గాంధీకి నివాళులు అర్పించిన సిపిఎం



గూడూరు, జనవరి 30 ప్రభాతవార్త : గూడూరులోని పెద్ద బజార్ వీధిలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి మహాత్మా గాంధి 77వ వర్ధంతి సందర్భంగా గూడూరులోని సిపిఎం పార్టీ నాయకులు పూలమాలవేసి వారి సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ప్రపంచానికి అహింసా సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించి, దేశ స్వాతంత్ర సంగ్రామంలో యావత్ దేశ ప్రజలను ఏకతాటిపై నడిపిన మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, నాయకులు పామంజి మణి, బివి రమణయ్య, అడపాల ప్రసాద్, బి. చంద్రయ్య, మదన్ తదితరులు పాల్గొన్నారు.

## భూమిని అన్యాక్రాంతంపై చర్యలు తీసుకోవాలి




దక్కిలి,జనవరి 30ప్రభాతవార్త : మండల కేంద్రమైన దక్కిలిలో ఉన్న విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని దక్కిలి గ్రామస్తులు గురువారం తహాశీల్దారు ఎం.శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. దక్కిలిలో గతంలో చెరువు కట్టపై చెలికం నారాయణరెడ్డికి అంగడి ఉండేదన్నారు. అ షాపును చెరువు పనుల్లో భాగంగా తొలగించినట్లు తెలిపారు. అయితే నారాయణరెడ్డికి చెందిన షాపును అతను ఇతర ప్రాంతాల్లో ఉంటూ వేరే వ్యక్తికి అద్దెకు ఇచ్చినట్లు చెప్పారు. ఈక్రమంలో షాపును తొలగించిన సంఘటనను అడ్డంపెట్టుకుని ప్రస్తుతం ప్రభుత్వం భూమిని చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియజేశారు. వాస్తవానికి నారాయణరెడ్డి ఒప్రవేటు సాఫ్ట్‌వేరు కంపెనీలో సాఫ్ట్‌వేరు ఇంజనీరుగా పనిచేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వాధికారులు భూమిని కాపాడి ప్రజా అవసరాలుకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని వారు తహాశీల్దారును కోరారు.

## గూడలిలో ఇసుక రిచ్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్



కోట, జనవరి 30 ప్రభాతవార్త : కోట మండలం గూడలి గ్రామంలో ప్రభుత్వం ఇసుక రిచ్‌ను ఏర్పాటు చేసింది. ఆమేరకు గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రామీనా ఈ ఇసుక రిచ్‌ను పరిశీలించారు. ఈ రిచ్‌లో ఇసుకలో ఎన్ని క్యూబిక్ మీటర్లు ఇసుకను తీయాలి, సిసికేమేరాలను ఎన్ని ఏర్పాటు చేయాలని కట్టదిట్టమైన భద్రత ఏర్పాట్లు చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం స్వర్ణముఖి నదిలో నీళ్లు ఉన్నాయని మరో 15 రోజుల లోపాల నీళ్ల తగ్గుతాయని తరువాత రిచ్‌ను ప్రారంభిస్తే బాగుంటుందని నీటి పారుదలశాఖ ఇంజనీర్లు సూచించారు. ఈక్రమంలో కూలీలు సబ్ కలెక్టర్ కలిసి తముకు ఉపాది దొరకడంలేదని తమకు ఇసుకను లోడింగ్ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. దీంతో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రిచ్‌ను ప్రవేటు కంపెనీకి ఇవ్వడం జరిగిందని ఆకంపెనీ ఎవరు తక్కవ ధరకు లోడింగ్ వస్తారా వారికి ఇస్తారని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణాలకు పోలీసులు ఇసుకను తీసుకొనికుండా అడ్డుపడుతున్నారని చెప్పారు. దీంతో ఇంటి నిర్మాణాలకు అడ్డుకోవద్దుని సూచించారు. ఆయన వెంట తహిశీల్దార్ కె. జయజయరావు, నీటిపారుదల శాఖ ఇంజినీర్లు విఆర్ఒలు ఉన్నారు.

## ఘనంగా గాంధీ వర్ధంతిని



రేణిగుంట జనవరి 30 ప్రభాతవార్త : భారతజాతి పిత మహాత్మా గాంధీకి రేణిగుంట పట్టణంలో గురువారం అవమానం జరిగింది. గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని రేణిగుంట నడిబొడ్డున ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించాల్సిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రజా సంఘాల ప్రతినిధులు కరువయ్యారు. నివాళులర్పించిన వారిలో టిడిపి సీనియర్ నేతలు డి పుష్పనాదం, మునీర్ జీకే, కొరియర్ రవి, అంబికా పతి, టిడిపి మండల మాజీ ఎస్సీ సెల్ కన్వీనర్ నెల్లూరు సుబ్రహ్మణ్యం, రేణిగుంట పట్టణ టిడిపి నేత వార్డు మెంబర్ ఎం.జి రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా కల్యాణ వేంకటేశ్వరుని శ్రవణ ఉత్సవం



నారాయణవనం, జనవరి 30 ప్రభాతవార్త : నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయం గురువారం శ్రవణ ఉత్సవంతో ఆలయం కిటకిట లాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మ వారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై అదిరోహించి ఊరేగించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్‌లు శనై, భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, మోహన్, అర్చకులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యం వికటించి పసికందు మృతిపై డిఐఓ విచారణ



పాలసముద్రం, జనవరి 30 ప్రభాతవార్త: పాలసముద్రం పిహెచ్‌సిలో డాక్టర్ సెలవు పెట్టడంతో ప్రసవం కోసం వచ్చిన గర్భిణీ స్త్రీకి స్టాఫ్ నర్స్ ప్రసవం చేయడంతో గర్భంలోనే పసికందు మృతి చెందిన విషయం స్పష్టమైంది. పాలసముద్రం పిహెచ్‌సికి ప్రసవం కోసం వచ్చిన గర్భిణీకి అక్కడి వైద్య సిబ్బంది సరైన వైద్యం అందించకపోవడంతో గర్భస్థ శివువు మృతి చెందాడని గురువారం 'ప్రభాతవార్త'తో ప్రచురితమైన విషయంపై డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారాణి ఈ వ్యవహారంపై విచారించి నివేదిక ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావును నియమించింది. ఈ మేరకు గురువారం పిహెచ్‌సికి వెళ్లి విచారించిన డిఐఓ డాక్టర్ హనుమంతరావుకు గర్భస్థ శిశువు మృతిపై పలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పిహెచ్‌సి డాక్టర్ శుక్రవారం సెలవులో వుండటంతో ఆ సమయంలో ప్రసవం కోసం అక్కడికి వెళ్ళిన ప్రతిభ అనే గర్భిణీకి స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఆమె వైద్యం అందించింది. గురువారం పిహెచ్‌సిలో జరిగిన విషయాలను అక్కడికి వచ్చిన మృతి చెందిన పసికందు బంధువులు డిఐఓకు వివరించారు. ఈ ఘటనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణికి నివేదిక ఇవ్వనున్నట్లు సమాచారం ఇచ్చి వెళ్ళారు. ఈ మేరకు పిహెచ్‌సి డాక్టర్ మోహన్‌కృష్ణ ఈ విషయంపై మాట్లాడుతూ పిహెచ్‌సిలో మొదటి కాన్పుకు ఎవరైనా వస్తే తాను చిత్తూరు లేదా తిరుపతికి తరలి వెళ్ళాలని సూచిస్తానని, అయితే ప్రతిభ కాన్పుకు వచ్చిన విషయం పిహెచ్‌సి వైద్య సిబ్బంది తన దృష్టికి తీసుకురాదలేదన్నారు.

## ఫిబ్రవరి 1న పెన్షన్లు

తిరుపతి కలెక్టరేట్, జనవరి 30 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్లు ఫిబ్రవరి 1వ తేదిన పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్లు పంపిణీ చేయాలని సచివాలయం సిబ్బందిని ఆదేశిస్తూ డీఎల్డీవోలను, ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం ఉదయం పీడీ డీఆర్‌డీఏ వెలుగు,లీడ్ బ్యాంకు మేనేజరు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, డీపీవో తదితరులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.

## దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, జనవరి 30 ప్రభాతవార్త : నగరంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అధికారులను కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధి 50వ వార్డులోని భూపాల్ హౌసింగ్ కాలని, తిమ్మినాయుడు పాలెం, అరుంధతివాడ, గరుడాద్రి నగర్, శ్రీనివాస నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం కార్పొరేటర్ అనిల్ కుమార్, ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ, ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో కలసి పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను పరిశీలించారు. వర్షాల సమయంలో కొండపైన పడే నీరు మా వీధుల్లోకి రావడంతో ఇబ్బంది పడుతున్నామని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మించాలని, త్రాగునీరు సకాలంలో పంపిణీ చేయాలని ప్రజలు కోరారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిఈ వెంకటప్రసాద్, ఎలక్ట్రికల్ డిఈ శిల్ప, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## గాంధీ ఆశయ సాధన కోసం కృషి



తిరుపతిరూరల్, జనవరి30 ప్రభాతవార్త: మహాత్మ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎపిఎస్పీడిసిఎల్ డైరెక్టర్ వై. లక్ష్మీ నరసయ్య తెలిపారు. ఎపిఎస్పీడిసిఎల్ సిఎండి సంతోషరావు ఆదేశాల మేరకు సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం మహాత్మ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహాత్మ గాంధీ అహింసా మార్గంలో అనేక ఉద్యమాలను చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్స్ జె.రమణాదేవి, డిఎస్ వరకుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్ధన్‌నాయుడు, జనరల్ మేనేజర్లు వై.వెంకటరాజు, ప్రసాద్, కృష్ణారెడ్డి, శోభ, శ్రీకాంత్, సురేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డిఎస్పీ



బాలాయపల్లి, జనవరి 30 ప్రభాతవార్త : బాలాయపల్లి పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన గూడూరు డిఎస్పి గీతిక తనిఖీ చేశారు. సిఐ ఏవి రమణ, ఎస్ఐ కామినేని గోపిలతో మండలంలోని సమస్యలను అడిగి తెలుసుకున్న డిఎస్పి గీతికా మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన డిఎస్పి గీతికా, సిఐ ఏవి రమణ, ఎస్ఐ కామినేని గాంధీజీ జాతికి చేసిన సేవలను డిఎస్పి కొనియాడారు.

## ప్రాణప్రదం...శిరస్త్రాణం: సిఐ హుస్సేన్‌బాషా



కోట, జనవరి 30 ప్రభాతవార్త : కొత్త సెల్‌ఫోన్ కొనుగోలు చేసిన వెంటనే స్క్రీన్‌గార్డు, బ్యాక్ కవర్ వేయిస్తాం. పాడయితే మళ్లీ కొనుగోలు చేస్తాం. సెల్‌ఫోన్ కోసం ఇంత ఆలోచిస్తున్నాం. ప్రాణాలు పోతాయని తెలిసినా వ్యక్తిగత భద్రత కోసం మాత్రం జాగ్రత్తలు తీసుకోవడం లేదని వాకాడు సిఐ హుస్సేన్‌బాషా అన్నారు. ఆయన గురువారం విలేఖరులతో మాట్లాడుతూ హెల్మెట్ ధరించ కుండానే వాయువేగంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లి చాలామంది ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. హెల్మెట్‌ను కొందరు బైక్‌కు తగిలించుకొని, మరికొందరు పెట్రోల్ ట్యాంకుపై పెట్టుకొని ప్రయాణిస్తున్నారని తెలిపారు. దీని వలన ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ప్రమాదాల్లో తలకు గాయాలు కాకుండా హెల్మెట్ అడ్డుకుంటుందని, మరణాల రేటు తగ్గుతుందన్నారు. కళ్లలో ఇసుక రేణువులు, తుప్పు, ముఖంపై పడదన్నారు. చలిగాలుల నుంచి తల, చెవులను కాపాడుకోవచ్చని తెలిపారు. కాలు చేయి విరిగితే చికిత్స చేయించుకోవచ్చని, కానీ సున్నితమైన తలకు గాయమయితే కోలుకోవడం కష్టమని చెప్పారు. ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే కుటుంబాలు వీధిన పడతాయని పేర్కొన్నారు.

## బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సీడీ రుణాలు:ఎంపిడిఓ



వాకాడు, జనవరి 30 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సీడీ రుణాలను అర్హులైన ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో మంజూరు చేసుకోవాలని ఎంపిడిఓ అన్నపూర్ణారావు అన్నారు. గురువారం ఎంపిడిఓ అన్నపూర్ణరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ రుణాలను విడుదల చేసిందని అర్హులైన ప్రతి ఒక్కరు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీసీ కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ ద్వారా కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్‌లో అర్హులైన ప్రతి ఒక్కరు ఆయా సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## పంబలేరు వాగులో యువత శవం లభ్యం

### -గాలించి వెలికి తీసిన పోలీసులు, రెవెన్యూ సిబ్బంది



గూడూరు, జనవరి 30 ప్రభాతవార్త: మండలంలోని పోటిపాలెం గ్రామంలో పంబలేరులో అనుమానా స్పదంగా ఓ యువతి మృతి చెందినట్లు గుర్తించారు. ఆ యువత ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన యూనిఫామ్ ధరించినట్లు సమాచారం. స్థానికులం దించిన సమాచార మేరకు గూడూరు రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసారు. పోలీసుల వివరాల మేరకు సూళ్లూరుపేటకు చెందిన లెహానిస్సీ గూడూరు ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఈసిఈ చదువుతున్నట్లు గుర్తించారు. ఈ విద్యార్థిని ప్రతి రోజు సూళ్లూరుపేట నుండి కళాశాలకు బస్సులో వస్తున్నట్లు, 20వ తేదిన బస్సు వెళ్ళిపోవడంతో ట్రైన్‌కు గూడూరుకు వచ్చిందని తల్లిదండ్రులు తెలిపారు. కళాశాల నుండి ఇంటికి రాకపోవడంతో అన్ని చోట్ల వెతికినా కనిపించకపోవడంతో సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గూడూరు రూరల్ పోలీసులు విద్యార్థిని మృతికి కారణాలపై విచారణ చేపట్టారు. కాగా మృతి చెందిన యువతికి ఈ నెల 31న పెళ్లి నిశ్చమైన్నట్లు తల్లిదండ్రులు పేర్కొన్నారు.

## చిట్టేడులో పాఠశాల తనిఖీ చేసిన తహాశీల్దార్



కోట, జనవరి 30 ప్రభాతవార్త : నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా పాఠశాలలను క్రమబద్ధీ కరించడంలో భాగంగా గురువారం కోట మండలం చిట్టేడు, వెంకన్న పాలెం ప్రాథమిక పాఠశాలలను తహాశీల్దార్ కె.జయజయ రావు తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపట్టికలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ సూచనల మేరకు పాఠశాలల్లో 60 మంది కన్నా ఎక్కువగా ఉంటే అటువంటి స్కూళ్లను మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సబ్ కలెక్టర్ ఆదేశాలతో పాఠశాలలను తనిఖీ చేసినట్లు తహాశీల్దార్ జయజయరావు తెలిపారు.

## ఆక్వా రైతులకు శుభవార్త...జోన్ సర్వేకు రంగం సిద్ధం



కోట, జనవరి 30 ప్రభాతవార్త : ఆక్వా సాగులో జోన్ల విధానంతో సాగుదారులు పడుతున్న కష్టనష్టాలను తీర్చేందుకు కూటమి ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. అర్హత కలిగిన చెరువులన్నింటినీ జోన్ పరిధిలోకి తీసుకొచ్చే ప్రక్రియకు శ్రీకారంచుట్టింది. ఇందులో భాగంగా ఆక్వా జోన్ సర్వే చేయనుంది. సర్వే చేయడానికి కలెక్టర్ నేతృత్వంలో మత్స్యశాఖ ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఆక్వా సాగు జరుగుతున్న ప్రతి చోటా జోన్ల సమస్య ఉంది. ఒకే ప్రాంతంలోని చెరువులు జోన్ పరిధిలో ఉంటూనే నాన్ ఆక్వా జోన్‌లో ఉన్నాయి. దీని వలన అర్హత ఉండి అనేకమంది సాగుదారులు ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందలేకపోతున్నారు. కనీసం విద్యుత్ సరఫరా తీసుకోవడానికి అనుమతులు లభించడం లేదు. దీంతో బిల్లుల భారంతో కుదేలవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం అర్హులైన రైతులకు కొండంత భరోసా లభిస్తోంది. సర్వే ద్వారా అర్హులైన ప్రతి సాగుదారుడికి ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందిస్తూ ఆక్వా సాగు సుస్థిరతకు కృషి చేస్తామని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

## పేదలకు ఇళ్ల స్థలాలు దక్కే వరకు పోరాటం : సీపీఐ



గూడూరు, జనవరి 30 ప్రభాతవార్త: పేదలకు ఇళ్ల స్థలాలు దక్కే వరకు సిపిఐ పోరాటం సాగిస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో గూడూరు నియోజకవర్గ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ సీనియర్ నాయకులు కన్నా సుబ్రమణ్యం అధ్యక్షతన నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలన్నారు. వచ్చే నెల 9వ తేది వరకు లబ్ధిదారుల ద్వారా దరఖాస్తుల స్వీకరించి, ఫిబ్రవరి 10వ తేదిన లబ్ధిదారుల ఆధ్వర్యంలో పట్టణంలో వార్డు సచివాలయాలు, గ్రామాల్లో గ్రామ సచివాలయాల్లో అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి. శశికుమార్, పట్టణ కార్యదర్శి ఎస్‌కె కాలేషా మాట్లాడుతూ అర్హులై ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, ఏఐటియుసి నియోజకవర్గాల అధ్యక్ష, కార్యదర్శులు ఎంబేటి చంద్రయ్య, నారాయణ, బికెఎంయు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, సిపిఐ నాయకులు సీతా భాస్కర్ రావు, వెంకటయ్య, తులసి, శేషయ్య, చెంగమ్మ, సిద్ధమ్మ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## వాకాడులో గాంధీజీ వర్ధంతి వేడుకలు



వాకాడు, జనవరి 30 ప్రభాతవార్త : మండల కేంద్రమైన వాకాడులోని మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపిడిఓ అన్నపూర్ణరావు ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అదే విధంగా తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలోని డిప్యూటీ తహశీల్దార్ సందీప్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్ యాదవ్ గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మండల టిడిపి కన్వీనర్ మధుసూధన్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. మంంలోని ప్రభుత్వ కార్యాలయంలో, పాఠశాలలోని, గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

## పేటలో మహత్మగాంధీ వర్ధంతి వేడుకలు



నాయుడుపేట, జనవరి 30 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో సూళ్ళూరుపేట తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం ఆధ్వర్యంలో తెదేపా నాయకులు మహత్మ గాంధీ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం మహత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళర్పించారు. ఈకార్యక్రమంలో ప్రసాద్‌నాయుడు,సంచి కృష్ణయ్య,గూడూరు సుదీర్‌రెడ్డి,అవదానం సుధీర్, సుజాత తదితరులు ఉన్నారు.

## పేటలో అబాకస్ పోటీలు



నాయుడుపేట, జనవరి 30 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని నారాయణ హైస్కూల్‌లో విద్యార్థులకు జోనల్‌స్థాయి అబాకస్ పోటీలు గురువారం నిర్వహించారు. ఈ అబాకస్ పోటీలకు వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, నాయుడుపేట పాఠశాలల విద్యార్థులు విధిగా పాల్గొని తమప్రతిభను కనపరిచారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నారాయణ పాఠశాల ఎజిఎమ్ రియాజ్ బహుమతులు,ప్రశంశా పత్రాలు ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ మల్లికార్జున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## ఉద్యాన పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలి



వెంకటగిరి, జనవరి 30 ప్రభాతవార్త : సరైన యాజమాన్య పద్ధతులు, జాగ్రత్తలతో అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వెంకటగిరి నియోజకవర్గం దక్కిలి గ్రామంలో గురువారం రైతు సదస్సులు నిర్వహించారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థులు, పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం సంయుక్తంగా నిర్వహించారు. ఉద్యాన కళాశాలలో బిఎస్సి ఉద్యాన కోర్సు నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గ్రామీణ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా దక్కిలి గ్రామంలో 3 నెలలుగా రైతులతో కలిసి ఉద్యాన పంటల సాగును పరిశీలించారు. తాము నేర్చుకున్న అంశాలపై గురువారం రైతు సదస్సు, ఉద్యాన పంటల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీటి శ్రీనివాస్ ప్రదర్శన ప్రారంభించారు. ఉద్యాన కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ వై. శిరీష తన ప్రసంగంలో తెగుళ్ల నివారణ, పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి ఆనంద్, ఉద్యాన కళాశాల ఏడిఆర్ డాక్టర్ బి. హరి మల్లికార్జున రెడ్డి, నిమ్మ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ కాందర్ నాయక్, ఎంఈఓ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు నాగరాజు ప్రసంగించారు. రైతులు సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. తగిన సూచనలు చేసారు.

## అటవీశాఖ కార్యాలయం వద్ద సిపిఐ ధర్నా



వెంకటగిరి, జనవరి 30 ప్రభాతవార్త : ఫారెస్ట్ రేంజ్ ఆఫీసు ముందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ధర్నాని ఉద్దేశించి సిపిఎం పార్టీ వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ పెట్లూరు పంచాయితీ పరిధి సర్వే నెంబర్ 12-1లో సీతారం ఏచూరి నగర్ నందు నివాసాలు ఉంటున్న స్థలానికి సంబంధించి హైకోర్టులో కేసు నడుస్తూ ఉన్నదని అన్నారు. హైకోర్టులో కేసు నడుస్తూ ఉన్నటువంటి స్థలానికి వెంకటగిరి ఫారెస్టు వారు నోటీసులు పంపించారని అన్నారు. వారు ఇచ్చిన నోటీసుల్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొంత మంది ఫారెస్టు సిబ్బంది అత్యుత్సాహం చూపుతూ రాజకీయ నాయకులకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పేదల జోలికి ఎవరు వచ్చిన సహించేది లేదని అన్నారు. ఫారెస్ట్ పేరు చెప్పి రెవెన్యూ భూముల్ని పెద్దోళ్ళకి కట్టబెట్టే పనులు చేస్తున్నారని అన్నారు. అత్యున్నత న్యాయస్థానంలో కేసు నడుస్తూ ఉంటే ఇప్పుడు నోటీసు పంపించడం ఎంత వరకు కరెక్టు అని అన్నారు. సీతారం ఏచూరి నగర్ నందు నివాసం ఉంటున్న పేదలందరికీ న్యాయం జరిపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిరంజీవి, నారాయణ, దొరబాబు, పెంచలయ్య, నాగరాజు, ప్రకాష్, శివకుమార్, రాజయ్య, దేశమ్మ, వెంకటసుబ్బయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి



వెంకటగిరి, జనవరి 30 ప్రభాతవార్త : ప్రయాణికులకు సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని జిల్లా రవాణాధికారి జి. నరసింహులు కోరారు. వెంకటగిరి లోని ఆర్టీసి డిపోలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్పించే భాద్యత డ్రైవర్ దేనని తెలిపారు. డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు సమావేశంలో మెకానిక్ లాస్ట్ మహేంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

## కృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు



చిల్లకూరు, జనవరి 30 ప్రభాతవార్త : మండల పరిధిలోని బల్లవోలు గ్రామానికి చెందిన దువ్వూరు కృష్ణారెడ్డి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మృతి చెందడం బాధాకరమని పలువురు దిగ్భ్రాంతికి గురౌతున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చురు వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, చేవూరు విజయ మోహన్ రెడ్డి, దువ్వూరు చంద్రారెడ్డి, గుండాల లీలావతి, చెరుకూరు పద్మజ అన్న మునిశేఖర్, మేకల కుమార్, కోట సతీష్, మేఘనూరు వెంకట కృష్ణయ్య, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాపరెడ్డి మనోహర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఓడూరు సత్యనారాయణరెడ్డి, మారంరెడ్డి అమర్నాథ్‌రెడ్డి, కొడవలూరు ధనంజయరెడ్డి, దువ్వూరు రమణారెడ్డి, కృష్ణారెడ్డి, అభిమానులు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జాగ్రత్తగా వాహనాల డ్రైవింగ్ చేయాలి : కలెక్టర్



చిత్తూరు, జనవరి 30 ప్రభాతవార్త: వాహనదారులు వాహనాలను నడిపే సమయంలో కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని రోడ్డు భద్రతా నియమాలను పక్కాగా పాటించి ముందుకు వెళ్ళాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ చిత్తూరు జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలో వున్న ఆర్టీఓ కార్యాలయం వద్ద మోటరు వాహనాల ర్యాలీని డిటిసీ నిరంజన్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ దర్గా సర్కిల్, ఎంఎస్ఆర్ సర్కిల్ మీదుగా గాంధీ సర్కిల్ వరకు సాగి అక్కడి నుండి పివికెఎన్ డిగ్రీ కళాశాల వరకు వెళ్ళింది. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జనవరి 15 నుండి ఫిబ్రవరి 16వ తేదీ వరకు ఒక నెల రోజుల పాటు సడక్ సుర్కా అభియాన్ కార్యక్రమం కింద రోడ్డు భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ సునీల్‌కుమార్, ఇవిఎంలు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో రోడ్డు విస్తరణ పనులు మేలోగా పూర్తి

### - కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్



కుప్పం, జనవరి 30 ప్రభాతవార్త : నియోజకవర్గ కేంద్రమైన కుప్పం పట్టణంలో ప్రధాన రహదారి నేతాజీ రోడ్ విస్తరణ పనులు మే నెలలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గురువారం కడ కార్యాలయంలో అధికారులు, నేతలతో సమావేశం అనంతరం కడ పి.డి. పట్టణంలోని ఎంఆర్‌రెడ్డి సర్కిల్‌నుంచి రైల్వేగేటు వరకు చేపట్టాల్సిన రీచ్ 3 పనులకు సంబంధించి ఇదివరకే మార్కింగ్ చేసిన భవనాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతానికి 61అడుగుల మేర రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు ఉండగా 65నుంచి 70అడుగుల మేర రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టడంతో పాటు రీచ్ 3 పనుల్లో భాగంగా భవనాలు కోల్పోయే వారికి పరిహారం కోసం ప్రభుత్వానికి తగు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపుతామన్నారు. ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్రనేత సురేష్‌బాబుల సహకారంతో కుప్పం పట్టణాన్ని ఏడాదిలోపు మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

**ఆర్‌అండ్‌బి అధికారులపై ఆగ్రహం :**

కుప్పంలో ప్రధాన రహదారి విస్తరణకు సంబంధించి పదేళ్ల క్రితం రూపొందించిన ప్రతిపాదనలు, మార్కింగ్‌లనే ఆర్‌అండ్‌బి అధికారులు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా రీచ్ 3 పనులు రద్దయినట్లు పిడికి చెప్పగా ఆయన మరింత ఆగ్రహించారు. రీచ్ 3 పనులు రద్దు చేసిన విషయం తన దృష్టికి ఎందుకు తేలేదని ఆగ్రహించారు. మరలా 70అడుగుల రోడ్డుతో ప్రతిపాదనలు సిద్ధ ం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఆర్డీఓ శ్రీనివాసులు రాజు, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బి ఎస్ఇ శ్రీనివాసులు, ఎఇ కృష్ణనాయక్, రాష్ట్ర నేతలు సురేష్‌బాబు, గోపీనాథ్, వెంకటేష్, కాణిపాకం వెంకటేష్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు జాకీర్, సోమశేఖర్, సెల్వరాజ్, వేలు, సురేష్,ఎంఆర్ సురేష్, నేతలు సత్యేంద్రశేఖర్, ఆర్ముగం, కన్నన్, మంజు, తిరుమగళ్ తదితరులు పాల్గొన్నారు.